

# హిండెన్‌బర్గ్-2 దెబ్బ

నష్టాల్లో అదానీ గ్రూప్ షేర్లు — మెజారిటీ స్టాక్స్ డీలా

**ఒక దశలో రూ.1.13 లక్షల కోట్ల సంపద ఆవిరి • సెబీ చీఫ్ రహస్య పెట్టుబడుల కలకలం**

**ముందుందు మరిన్ని భారతీయ సంస్థలపై అమెరికా షార్ట్-సెల్లర్ల గురి?**

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ షేర్లు మరోమారు మూకుమ్మడిగా కుప్పకూలాయి. శనివారం మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ దంపతులపై అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో సోమవారం ఈక్విటీ మార్కెట్లు షేక్ అయ్యాయి. ఈ క్రమంలోనే ఆరంభంలో భారీ నష్టాల దిశగా సూచీలు పయనించాయి. అదానీ గ్రూప్‌నకు చెందిన 10 సంస్థల షేర్లు పెద్ద ఎత్తున క్షీణించాయి. ఫలితంగా అదానీ గ్రూప్ మార్కెట్ విలువ ఒక్కసారిగా దాదాపు రూ.1.13 లక్షల కోట్లు (13.4 బిలియన్ డాలర్లు) హరించుకుపోయింది. అయితే సమయం గడుస్తున్నకొద్దీ అటు సూచీలు, ఇటు షేర్లు తిరిగి కోలుకున్నాయి. అయినప్పటికీ మెజారిటీ షేర్లు నష్టాలకే పరిమితం కావడం గమనార్హం. అంబుజా సిమెంట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ స్వల్పంగా లాభపడ్డాయి. మిగతా 8 షేర్లు 4.14 శాతం నుంచి 0.65 శాతం మేర దిగజారాయి. దీంతో ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు రూ.22,064 కోట్ల నష్టం వాటిల్లింది. ఇక మొత్తంగా చూసినట్టైతే బీఎస్ఈలోని 11 అదానీ గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లపైనే. కాగా, సెబీ చీఫ్ మాధవి పురి, ఆమె భర్త ధవల్ బచ్.. బెర్ముడా, మారిషస్‌ల్లోని ఫండ్లలో పెట్టుబడులు పెట్టారని, అవి అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ కనుసన్నల్లో నడుస్తున్నవంటూ హిండెన్‌బర్గ్ ఓ 'విజిల్‌బ్లోయర్' డాక్యుమెంట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ అక్రమాలపై సెబీ విచారణ తూతూ మంత్రంగా సాగిందని ఆరోపించిన సంగతీ విదితమే. అయితే వీటిని ఆదివారం బచ్ దంపతులు కొట్టిపారేశారు. అదానీ గ్రూప్ సైతం వీరితో తమకెలాంటి వాణిజ్య సంబంధాల్లేవని స్పష్టం చేసింది. గత ఏడాది జనవరిలో అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడిందంటూ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదిక.. భారతీయ స్టాక్ మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టించినది తెలిసిందే. అదానీ కంపెనీల మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్లకుపైగా పడిపోయింది.

### భారతీయ సంస్థలపైనే గురి?


ఏడాదిన్నర క్రితం అదానీ గ్రూప్ ప్రధాన లక్ష్యంగా తొలి రిపోర్టును విడుదల చేసిన హిండెన్‌బర్గ్.. ఇప్పుడు దానికి కొనసాగింపుగా రెండో నివేదికను తెచ్చింది. ఈ నేపథ్యంలో ఈ తరహా రిపోర్టులు మరిన్ని భారతీయ సంస్థలపై రావచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. హిండెన్‌బర్గ్ వంటి ఇంకొందరు అమెరికా షార్ట్-సెల్లర్లు ఈ దిశగా రిసెర్చ్ చేస్తున్నారన్న అభిప్రాయాలను వారు వెల్లడిస్తుండటం సర్వత్రా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. మొత్తానికి భారతీయ సంస్థలపైనే షార్ట్-సెల్లర్ల గురి ఉందన్నది స్పష్టంగా తెలుస్తున్నది. దీంతో బడా కార్పొరేట్ కంపెనీల్లో ప్రకంపనలు మొదలవుతున్నాయి. మార్కెట్ అక్రమాలు, డొల్ల కంపెనీలు, నిధుల గోల్‌మాల్, కేంద్ర ప్రభుత్వ పెద్దలు-ఉన్నతాధికారుల హస్తం అన్నింటిపైనా షార్ట్-సెల్లర్లు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

### రిస్క్‌లో ఎంఎఫ్ పెట్టుబడులు!

అదానీ సంస్థల్లోకి రూ.42వేల కోట్లు

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణల నేపథ్యంలో అదానీ గ్రూప్ సంస్థల షేర్లలో వివిధ మ్యూచువల్ ఫండ్స్ పెట్టిన పెట్టుబడులు ప్రమాదంలో పడ్డాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయిప్పుడు. ముఖ్యంగా రిటైల్ మదుపరుల్లో టెన్షన్ మొదలైంది. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన మొత్తం 11 అదానీ గ్రూప్ సంస్థల్లో ఎన్డీటీవీ మినహా మిగతా 10 కంపెనీల్లో మ్యూచువల్ ఫండ్స్ ద్వారా జరిగిన పెట్టుబడులు వాల్యూ రిసెర్చ్ వివరాల ప్రకారం ఈ ఏడాది జూలై ఆఖరు నాటికి రూ.41,814 కోట్లుగా ఉన్నాయి. అయితే టాప్-5 సంస్థల్లోని పెట్టుబడులే రూ.41వేల కోట్లుగా ఉండటం గమనార్హం. ఇందులో అత్యధికంగా అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో రూ.13,024 కోట్ల మేర ఉన్నాయి. అత్యల్పంగా సంఘీ ఇండస్ట్రీస్ రూ.5.95 కోట్లుగా ఉన్నాయి.

| మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు | విలువ (రూ.కోట్లలో) |
|---|---|
| అదానీ పోర్ట్స్ | 13,024.22 |
| అంబుజా సిమెంట్స్ | 8,999.25 |
| ఏసీసీ | 7,668.38 |
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 7,290.63 |
| అదానీ పవర్ | 4,027.77 |




**బీఎస్ఈలో అదానీ షేర్ల నష్టాలు (%)**

| సంస్థ | ఆరంభంలో | ముగింపులో |
|---|---|---|
| అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ | 17 | 3.70 |
| అదానీ టోటల్ గ్యాస్ | 13.39 | 4.03 |
| ఎన్డీటీవీ | 11 | 3.08 |
| అదానీ పవర్ | 10.94 | 0.65 |
| అదానీ గ్రీన్ ఎనర్జీ | 6.96 | 1.12+ |
| అదానీ విల్మర్ | 6.49 | 4.14 |
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 5.50 | 1.09 |
| అదానీ పోర్ట్స్ | 4.95 | 2.02 |
| అంబుజా సిమెంట్స్ | 2.53 | 0.55+ |
| ఏసీసీ | 2.42 | 1.55 |

### స్వల్ప నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 56.99 పాయింట్లు పడిపోయి 79,648.92 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 20.50 పాయింట్లు కోల్పోయి 24,347 వద్ద స్థిరపడింది. అయితే ఒకానొక దశలో సెన్సెక్స్ 479.78 పాయింట్లు, నిఫ్టీ 155.40 పాయింట్లు దిగజారాయి. సెన్సెక్స్ షేర్లలో అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, ఎస్బీఐ, నెస్లే షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. రంగాలవారీగా యుటిలిటీస్, ఎఫ్ఎంసీజీ నిరాశపర్చాయి. ఆసియా మార్కెట్లలో కొరియా, హాంకాంగ్ లాభాల్లో, చైనా నష్టాల్లో ముగిశాయి.


## 'వాణిజ్య దౌత్యవేత్తలు కీలకం'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య దౌత్యవేత్తల పాత్ర కీలకంగా మారిందని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో 'విదేశీ వాణిజ్యం-పెట్టుబడులు' అంశంపై ఓ అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ నెల 30దాకా జరిగే ఈ కార్యక్రమానికి ఈజిప్టు నుంచి 14 మంది అగ్రశ్రేణి దౌత్యవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ.. గ్లోబల్ మార్కెట్‌లో తాజా పోకడలు నిపుణుల అవసరాన్ని పెంచుతున్నాయన్నారు. దేశాల మధ్య దౌత్య, రాజకీయ సంబంధాలను పెంపొందించడంలో భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులూ ప్రధానమేనన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ హెడ్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

### బీటీలో భారతీ గ్లోబల్‌కు 24.5% వాటా

**డీల్ విలువ రూ.33,500 కోట్లు**

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బ్రిటన్‌కు చెందిన బహుళజాతి టెలికం సంస్థ బీటీ గ్రూప్‌లో సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన భారతీ గ్లోబల్‌కు 24.5 శాతం వాటా దక్కుతున్నది. డీల్ విలువ దాదాపు రూ.33,500 కోట్లు (4 బిలియన్ డాలర్లు). కాగా, బీటీ గ్రూప్‌లోని ఆల్టీస్ నుంచి 9.99 శాతం వాటాను వెంటనే కొనేస్తున్న భారతీ.. మిగతా వాటాను రెగ్యులేటరీ అనుమతులు వచ్చాక సొంతం చేసుకోనున్నది. అధిక రుణభారం నేపథ్యంలోనే ఈ వాటాను ఆల్టీస్ అమ్ముకుంటున్నది. ఇదిలావుంటే టాటా, మహీంద్రా, వెల్‌స్పన్ తర్వాత బ్రిటీష్ సంస్థల్లో వాటాలను పొందిన భారతీయ సంస్థగా భారతీ ఎంటర్‌ప్రైజెస్ నిలిచింది.




## 5 నెలల కనిష్టానికి ఐఐపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ జూన్‌లో 5 నెలల కనిష్టాన్ని తాకుతూ 4.2 శాతంగానే ఉన్నది. జనవరి తర్వాత ఇప్పుడే ఆ స్థాయి గణాంకాలు నమోదయ్యాయని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. ఇక గనులు, విద్యుత్తు రంగాలు బాగున్నా.. కీలకమైన తయారీ రంగం నెమ్మదించింది.

**జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.54%**

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల ఐదేండ్ల కనిష్టానికి తగ్గింది. జూలైలో 3.54 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్ఓ ప్రకటించింది. 2019 సెప్టెంబర్‌లో 3.99 శాతంగా నమోదైంది. మళ్లీ ఇప్పుడే ఆ స్థాయి కంటే తక్కువకు చేరింది. ఇక అంతకుముందు నెల జూన్‌లో ఈ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రేటు 5.08 శాతంగా ఉండగా, నిరుడు జూలైలో 7.44 శాతంగా ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం కొంతమేర అదుపులోకి రావడం కలిసొచ్చింది. మరోవైపు తాజా గణాంకాలతో ఆర్బీఐ రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

### డిపాజిట్ వాపస్

ముంబై, ఆగస్టు 12: డిపాజిట్ చేసిన 3 నెలల్లోగా అత్యవసర పరిస్థితి అంటూ డిపాజిటర్లు వస్తే ఆ మొత్తాన్నీ వెనక్కి ఇచ్చేయాల్సిందేనని ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్బీఐ సోమవారం స్పష్టం చేసింది. అయితే వడ్డీ చెల్లింపులుండవు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది.

### పీఎన్‌బీ బ్రెయిలీ కార్డ్

పీఎన్‌బీ.. అంతః దృష్టి బ్రెయిలీ డెబిట్ కార్డును అందుబాటులోకి తెచ్చింది. చూపులేని వారికోసం దీన్ని పరిచయం చేసింది. రూపే నెట్‌వర్క్‌పై ఇది లభిస్తుంది.

## అప్‌ట్రెండ్‌లో బంగారం-వెండి

- **4 రోజుల్లో తులం రేటు రూ.1,310 పైకి**



న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.270 ఎగిసి రూ.70,580ని తాకింది. 22 క్యారెట్ రూ.250 ఎగబాకి రూ.64,700గా నమోదైంది. దీంతో గడిచిన నాలుగు రోజుల్లో తులం మేలిమి పుత్తడి ధర రూ.1,310 పెరిగినట్టైంది. ఆభరణాల పసిడి సైతం రూ.1,200 పుంజుకున్నది. ఇక ఢిల్లీలో 99.9 స్వచ్ఛత కలిగిన గోల్డ్ రేటు రూ.200 పుంజుకొని రూ.72,350గా ఉన్నది. 99.5 స్వచ్ఛతతో ఉన్నది రూ.72,000గా నమోదైంది. ఇదిలావుంటే వెండి ధర రూ.1,000 అందుకుని రూ.83,500ను చేరింది. హైదరాబాద్‌లో రూ.87,500 పలికింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు గోల్డ్ రేటు 8.40 డాలర్లు పెరిగి 2,481.80 డాలర్లుగా ఉన్నది. ఔన్సు వెండి 28.01 డాలర్లుగా నమోదైంది. కొనుగోలుదారులు, ఆభరణాల తయారీదారుల నుంచి పెరిగిన డిమాండే ధరలను పరుగులు పెట్టిస్తున్నాయని మార్కెట్ వర్గాలు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు.

## 17 ఏండ్ల క్రితం పట్టాలు

- **ఇప్పటికీ స్థలం చూపించని వైనం**
- **తహసీల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ఆందోళన**



తహసీల్దార్ శాంతకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్

చందూర్, ఆగస్టు 12 : చందూర్ మండల కేంద్రంలోని మర్రిబోడ కాలనీలో భూములను కేటాయిస్తూ 17 ఏండ్ల క్రితం పట్టాలు అందజేసి, ఇప్పటికీ స్థలాలను చూపించలేదని చందూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు స్థలాలను చూపించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులతో కలిసి చందూర్ తహసీల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు ఎర్రజెండాలతో సోమవారం నిరసన తెలిపారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ శాంతకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్, ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి'కి వెల్లువెత్తిన ఫిర్యాదులు

కంఠేశ్వర్, ఆగస్టు 12 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెండు వారాలుగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో పెద్ద మొత్తంలో 154 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఆర్డీవో సాయాగౌడ్‌కు అర్జీలు సమర్పించారు.

**నాగారంలో సమస్యలు పరిష్కరించాలని..**

కంఠేశ్వర్, ఆగస్ట్ 12 : జిల్లాకేంద్రంలోని నాగారంలో సమస్యలు తీర్చాలని ఐద్వా నాయకులు విన్నవించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. నాగారంలోని శ్మశానవాటిక రోడ్ల మరమ్మతులు, వీధి లైట్ల సమస్యలు ఉన్నాయని, గతంలో కూడా చాలా సార్లు మున్సిపల్ కార్యాలయంలో విన్నవించినట్లు తెలిపారు. శ్మశానవాటికలో మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విన్నవించారు.

### ప్రాజెక్టులోకి దూకి.. మహిళా ఆత్మహత్యాయత్నం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 12: మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను యువకులు, కానిస్టేబుల్ కాపాడారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన వనం నాగరాణి(33) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవడానికి సోమవారం సాయంత్రం పోచారం ప్రాజెక్టు వద్దకు వచ్చింది. తన సెల్‌ఫోన్‌ను ప్రాజెక్టుపై ఉంచి నీళ్లలోకి దూకగా.. పరిసర ప్రాంతంలో ఉన్న మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నరేశ్, అఖిల్ అనే యువకులు గమనించి ప్రాజెక్టులోకి దిగి మహిళను పైకి లాగి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మల్లారెడ్డి, కానిస్టేబుల్ వినోద్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను కడుపులో నుంచి నీటిని కానిస్టేబుల్ వినోద్‌కుమార్ బయటికి తీయించి ప్రాణాలు కాపాడారు. అనంతరం ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులకు చెప్పి నాగమణిని వారికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ప్రాణాలకు తెగించి కాపాడిన యువకులు నరేశ్, అఖిల్‌తోపాటు సమయస్ఫూర్తితో వ్యవహరించిన కానిస్టేబుల్ వినోద్‌కుమార్‌ను ఎస్సైతోపాటు గ్రామస్తులు అభినందించారు.


## ఎస్సీ వర్గీకరణ... బీజేపీ తీర్పు



భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భీమ్‌గల్, ఆగస్టు 12: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మాలల సంక్షేమ ఐక్య వేదిక, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మాలల మహా సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు అంగ రి ప్రదీప్ హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయం సుప్రీం కోర్టు తీర్పు కాదని, బీజేపీ ఇచ్చిన తీర్పు అని మండిపడ్డారు. దళితుల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలనే దురుద్దేశంతో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని నిర్ణయించారని ఆరోపించారు. మాలలను ఐక్యం చేసి తెలంగాణలో బీజేపీ నామరూపాలు లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాల్లో ఎవరు ప్రయోజనం పొందారో లెక్కలు తీసి శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అశాస్త్రీయంగా వర్గీకరణ చేస్తామంటే అడ్డుకుంటామని అన్నారు. అనంతరం ర్యాలీగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బట్టు అనిల్, డైడి సురేశ్, మేకల శ్రీనివాస్, పర్స విఘ్నేశ్, బట్టు సునీల్, చిత్తరి ఆనంద్, బీమా రవీందర్, సంపత్, సీనియర్ దళిత నాయకులు పర్స అనంతరావు, సోమిడి దేవిదాస్, రమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

### బోధన్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా సంధ్యదాము



బోధన్, ఆగస్టు 12: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా అంకు సంధ్యదాముసు, పాలక వర్గాన్ని నియమిస్తూ అగ్రికల్చర్ కో- ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలంగాణ, కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రతిపాదనల మేరకు పాలకవర్గాన్ని నియమించారు. ప్రస్తుతం బోధన్‌లోని 26వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్న అంకు సంధ్యదామును చైర్ పర్సన్‌గా, వైస్ చైర్మన్‌గా చిల్ల శంకర్‌తోపాటు మరో 16 మంది డైరెక్టర్లతో పాలకవర్గ కమిటీని నియమించారు. డైరెక్టర్లుగా కర్నె గంగారాం, కండెపు వెంకటేశ్వర్ రావు, నడిపోల్ల వసంత్‌రెడ్డి, రమావత్ రవిదాస్, సంగపు భూమయ్య, బొబ్బిలి శ్రీనివాస్, చేపూరి గంగా కిశోర్, నీరడి సాయన్న, బొర్రోల్ల శ్రీనివాస్, సలీం బేగ్, ఆవుల బాలకృష్ణా రెడ్డి, చీకోటి అంజయ్య, బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్‌తోపాటు మరో ఇద్దరిని డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## బంద్ ప్రశాంతం

బాన్సువాడ/నస్రుల్లాబాద్/మోస్రా (చందూర్)/భీమ్‌గల్, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ, నస్రుల్లాబాద్, మోస్రాలో గ్రామస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించి నిరసన తెలియజేశారు. భీమ్‌గల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలతోపాటు ప్రైవేట్ విద్యా సంస్థలను మూసి ఉంచారు. పలు హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో దాడులు హేయమైన చర్య అన్నారు. దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వ్యాపార సముదాయాలను బంద్ చేసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు.




భీమ్‌గల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

